# రేపటి సూర్యుడు

-తిరుమలశ్రీ

రమణకు దుఃఖం ఉప్పెనలా ముంచుకొస్తోంది. తుపానుకు గురైన సముద్రంలా వుంది వాడి మనసంతా.

"మమ్మీ! ప్లీజ్, మమ్మీ! ఒక్క వంద రూపాయలు మమ్మీ! మళ్లీ ఇలాంటి ఛాన్సెప్పుడూ రాదు మమ్మీ!" అంటూ బ్రతిమాలుతున్న కొడుకు వంక నిస్సహాయంగా చూసింది కృష్ణవేణి.

"మీ నాన్న సంగతి తెలిసుండీ అంత మంకు పట్టు నీకెందుకురా?" వచ్చి అన్నం తిను. నా బాబువి కదూ?" అంటూ ఎదురు బ్రతిమలాడింది.

"ఉహు, నేను క్రికెట్ మ్యాచ్‌కి వెళ్తాను. నా ఫ్రెండ్సంతా అప్పుడే టిక్కెట్లు కొనేసుకున్నారు. మమ్మీ! ఆలస్యమైతే టికెట్లు అయిపోతాయి. డబ్బివ్వు మమ్మీ! ప్లీజ్!" అన్నాడు రమణ తల్లిని చుట్టుకుపోయి.

"ఒద్దు నాన్నా! డాడీ వద్దన్న పని చేస్తే ఏమవుతుందో తెలుసుగా? ఇంచక్కా ఇంట్లో కూర్చుని టీవీలో చూద్దువుగానిలే మ్యాచ్" అందామె.

వినిపించుకోలేదు వాడు. మారాము ఆరంభించాడు. రమణకు పన్నెండేళ్లుంటాయి. ఏడో తరగతి చదువుకున్నాడు. చదువు మీద శ్రద్ధాసక్తులు వున్న వాడు. క్లాసులో ఎప్పుడూ ఫస్ట్ వస్తాడు. క్రికెట్ వాడికి మరో ప్రాణం.

పది రోజుల్లో ఆ వూర్లో ఇండియా-వెస్టిండీస్ మధ్య వన్‌డే ఇంటర్నేషనల్ మ్యాచ్ జరగబోతోంది. అంతవరకూ క్రికెట్ మ్యాచ్‌ని టీవీలో చూడడమే తప్ప నేరుగా ఎప్పుడూ చూళ్లేదు రమణ. పైగా స్టేడియంకి వెళ్లి ఆట వాచ్ చేసినట్లయితే తన అభిమాన ఆటగాళ్లను చూడవచ్చును. అటువంటి అవకాశం చాలా అరుదుగా లభిస్తుంది. అందుకే ఎలాగైనా సరే టికెట్ కొనుక్కుని క్రికెట్ మ్యాచ్ చూడాలని వువ్విళ్లూరాడు.

టికెట్‌కి వంద రూపాయలైనా కావాలి. తన ఫ్రెండ్స్ అప్పుడే టికెట్స్ కొనేసుకున్నారు కూడాను. ఆ అవకాశాన్ని మిస్ చేయకూడదన్న తపన.

తన కోరిక తండ్రి ముందు వెల్లడించాడు రమణ. పూర్తిగా వినిపించుకోకుండానే కసిరేశాడతడు. చక్కగా ఇంట్లో కూర్చుని టీవీలో చూడ గలిగిన మ్యాచ్‌ని, డబ్బులు తగలేసి స్టేడియంకి వెళ్లి వాచ్ చేయడం శుద్ధ దండుగ అన్నాడు. క్రికెటర్సా తమలాంటి మనుషులేనని, నేరుగా చూడకపోతే వచ్చే నష్టం లేదనీ హేళన చేశాడు. రమణ వినిపించుకోకుండా డబ్బుల కోసం పట్టు పట్టడంతో, క్రికెట్ గ్రికెట్ అంటూ ఆటలతో చదువు అటకెక్కిస్తే ఎముకలేరేస్తాను జాగ్రత్త! అంటూ అరచి కరచినంత పని చేశాడు. అసహాయతతో గ్రుడ్ల నీరు క్రుక్కుకోవడం మినహా ఏమీ చేయలేకపోయాడు వాడు. తల్లి కూడా కాదనడంతో వాడి ఆశ అడుగంటిపోయింది.

కాని, ఎలాగైనా సరే స్టేడియంలో మ్యాచ్ చూడాలన్న పట్టుదల పెరిగింది రమణలో తాను చేస్తున్నది తప్పని తెలిసినా, ఎన్నడూ లేనిది ఓ రాత్రివేళ లేచి తల్లి డబ్బులు దాచే బిస్కెట్ టిన్ తీసి అందులోంచి వంద రూపాయలు తీశాడు. ఆ పని చేస్తున్నప్పుడు వాడి గుండె వేగంగా కొట్టుకుంది. చేతులు వణికాయి. అయినా వాడి క్రికెట్ పిచ్చి ముందు తాను చేస్తున్నది దొంగతనం అన్న విషయం గుర్తుకు రాకుండా పోయింది.

అయితే దురదృష్టవశాత్తు అనుకోకుండా తండ్రికి మెలకువ రావడమూ, రమణ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడడమూ జరిగాయి. అంతే! పసివాడనయినా ఆలోచించకుండా అర్ధరాత్రి వేళ కొడుకు వొళ్లంతా హూనం చేసేశాడతను డిసిప్లిన్ పేరుతో. ఫలితంగా మర్నాటికి జ్వరంతో మూసిన కన్ను తెరవలేదు వాడు. కొడుకు దుస్థితికి కృష్ణవేణి గ్రుడ్ల నీళ్లు క్రుక్కుకుంది. ఆ సంఘటన ఆమెలో ఆలోచనలను రేపింది.

రమణ మంచి పిల్లాడు. చదువులో ఫస్టు. క్రికెట్ బాగా ఆడడమే కాక, అది వాడికి ఆరో ప్రాణం. ఉన్న వూర్లో ఇంటర్నేషనల్ మ్యాచ్ జరుగబోతోంది. వాడి అభిమాన ఆటగాళ్లు అందులో పాల్గొంటున్నారు. మ్యాచ్‌ని ప్రత్యక్షంగా చూడడం

వల్ల ఆటలోని మెళకువలను, సూక్ష్మతను గ్రహించి, వాడు ఆటను ఇంప్రూవ్ చేసుకునేందుకు దోహదం కావచ్చును. తన ఫేవరెట్ ప్లేయర్స్‌ని చూశానన్న సంతోషము, తృప్తీ వాడికి కలుగుతాయి. అదో గొప్ప ఇన్స్‌పిరేషనై ఆటపట్ల మరింత ఆసక్తిని పెంచవచ్చును. కాని, భర్త వ్యతిరేకత వాడిని కృంగదీస్తుంది. ఎన్నడూ లేనిది దొంగతనానికి కూడా పూనుకున్నాడంటే, వాడి కోర్కె ఎంతటి బలీయమైనదో అర్థమవుతోంది. వంద రూపాయలు తమకో లెక్కలోనివి కావు కూడాను. అర్థం చేసుకుని, హానికరం కానంతవరకు వాటిని నెరవేర్చగలిగితే వాళ్లు పెడత్రోవలు పట్టే అవసరము, అవకాశము వుండవేమో! ఇలా పరిపరి విధాలా ఆలోచించడం మినహా అశక్తురాలామె. అంతటి జ్వరంలోనూ వాడు మ్యాచ్ గురించే కలవరిస్తూంటే ఆమె తల్లి మనసు విలవిల్లాడింది. కాని, భర్త ఇష్టానికి వ్యతిరేకంగా కొడుక్కు డబ్బులు ఇవ్వలేదు తాను. రెండో రోజున కాని రమణకు జ్వరం తగ్గలేదు. అలిగి అమ్మ నాన్నలతో మాట్లాడడం మానేశాడు వాడు. అయితే మ్యాచ్ చూడాలన్న తపన మాత్రం అలాగే వుంది. అది వాడిలో తెగింపును తెచ్చింది.

గత సంవత్సరం వాడి బర్త్‌డేకి అక్క ఫారిన్ వాచ్ ప్రెజెంట్ చేసింది. ఆమధ్య బెల్ట్ పిన్ వూడిపోవడంతో డ్రాయర్‌లో దాచి వుంచాడు దాన్ని. అదిప్పుడు గుర్తుకొచ్చింది. గప్‌చుప్‌గా ఆ వాచ్‌ని తీసుకువెళ్లి తన స్నేహితుడు నవీన్ సాయంతో మార్వాడీ కొట్లో వంద రూపాయలకు అమ్మేసాడు. ఇంట్లో దాని ఆరా వచ్చినప్పుడు ఏదో ఒకటి చెప్పొచ్చులెమ్మని.

జేబులోని వంద రూపాయల నోటు ఎక్కడలేని హుషారు కలిగించింది రమణకు. నవీన్‌తో కలిసి మ్యాచ్ టికెట్ కొనడానికి వెళుతూంటే– వాడి ముఖం ఆనందంతో మెరిసిపోతోంది. తానప్పుడే స్టేడియంలో కూర్చున్నట్టూ, క్రికెట్ మ్యాచ్‌ని వాచ్ చేస్తున్నట్టూ కలలు చెలరేగాయి. తన అభిమాన ఆటగాళ్లు కట్టెదుట వున్న అనుభూతి....

○○○

పేవ్‌మెంట్ మీద– చింకి గుడ్డలతో, చింపిరి జుట్టుతో ఓ మతిలేని స్త్రీ. కళ్లలో ప్రాణాలతో తాటాకు బొమ్మలా కూర్చుని వుంది. ఆమె వొడిలో మూణ్ణెల్ల ఓ పసికందు. వాడి వొంటిమీద పల్చటి కురచగా వున్న జుబ్బా తప్ప మరో ఆచ్ఛాదన లేదు. ఆకలితో గుక్కపట్టి ఏడుస్తున్నాడు. అస్థి పంజరం లాంటి తల్లి పాలిండ్లను ఆర్తిగా, ఆశగా చప్పరిస్తున్నాడు. నోటికి తడి తగలడం లేదని కోపంతో, అసహాయతతో కాళ్లూ చేతులూ కొట్టుకుంటూ ఏడుస్తున్నాడు. ఆశతో మళ్లీ నోటికి అందుకుంటున్నాడు. మళ్లీ ఏడ్పు. మతిలేనిదైనా, గతిలేనిదైనా అమ్మ అమ్మే!... పసివాడి ఆకలి ఘోషను చూసి తట్టుకోలేక నిస్సహాయతతో కళ్ల నీళ్లు పెట్టుకుంటున్నదామె. బిడ్డను సముదాయించడానికి ప్రయత్నిస్తోంది. తెలిసీ తెలియనితనంతోనే, తింగరి పలుకులతోటే దారినపోయే వారిని అడుక్కుంటోంది– తన బిడ్డకు ఆకలి తీర్చమని! చేతులు చాచి అర్థిస్తోంది... ఆమెను చూసి అసహ్యంతోనో, భయంతోనో తప్పించుకుపోయేవారు, చీదరించుకుని కసురుకునేవారే తప్ప గోడు వినే నాథుడే లేకపోయాడు.

'గంతకు ఓ బొంత అన్నట్టు... దీని బ్రతుక్కి శారీరక సుఖం కావాల్సొచ్చింది కాబోలు! అసలు దీనికి మైనార్టీ అయినా తీరిందో లేదో! ఇలా అడ్డమైనదీ బిడ్డను కనేసి రోడ్డున పడేస్తే ఈ దేశం గతేం కావాలి?' అంటూ ఈసడించుకునే వారు కొందరైతే–

'పాపం! పిచ్చిదన్న కనికరమైనా లేకుండా ఆ పిల్లను తల్లిని చేసిన దౌర్భాగ్యుడెవరో?!' అంటూ సానుభూతి చెందేవారు మరికొందరు.

ఎవరి సానుభూతులూ, సాధింపులూ ఆ పసి బిడ్డ పొట్టని నింపవు గదా! ఆకలితో తల్లి వొళ్లో

## వైరస్

ఇప్పుడు మనుషులందరి
'జబ్బు' – వ్యక్తిగతంగా గెలవాలని–
సహజీవనాన్ని, సమాజాన్ని వదలిన మనిషికి
'వ్యక్తిగతం' యింకేముంటుంది?

–పెరుగు రామకృష్ణ

దొర్లుతూ సుళ్లు తిరిగిపోతూన్న... ఆ బాధకు పేరేమిటో కూడా ఎరుగని... ఆ చంటి బిడ్డ ఆకలి బాధను మాత్రం తీర్చడానికి పూనుకోలేదెవరూను! ఆ తల్లి ఆక్రందనకు కరిగిపోలేదెవరూను! ఆగని ప్రవాహంలా ఆ జన జీవనం సాగిపోతూనే వుంది. పేవ్‌మెంటు మీది ఆ దయనీయ స్థితిని ఎందరో గమనిస్తూనే వున్నారు. అయినా ఆగి ఆలోచించే తీరిక కరువయింది అందరికీ. ఆకలితో ఆ బిడ్డ చచ్చిపోతుందేమోనన్న ఆలోచన కూడా లేక పోయింది ఎవరికీను.

స్నేహితుడితో కబుర్లు చెబుతూ వడివడిగా అడుగులు వేసుకుంటూ నడుస్తూన్న రమణ, కాళ్లకు బ్రేక్ వేసినట్లుగా హఠాత్తుగా ఆగి పోయాడు- ఆ దృశ్యం కళ్లబడగానే. ఆ పసివాడి దయనీయ స్థితి- ఆ పిచ్చి తల్లి దుస్థితీ రమణ మనసును కలచివేశాయి. సున్నిత మనస్కుడైన ఆ కుర్రాడి కళ్లమ్మట నీళ్లు తెప్పించాయి. అడుగు ముందుకు పడలేదు.

పసివాడు ఏడ్పుతో మళ్లీ గుక్కపట్టాడు. వెన్నుకు అంటుకుపోయిన కడుపుతో గుక్క తిప్పు కోలేకపోతున్నాడు. వాణ్ణి ఎలా వూరుకోబెట్టాలో తెలీక వాణ్ణి గుండెలకు హత్తుకుని విలపిస్తోంది తల్లి మౌనంగా. కన్నీరు ధారాపాతమయింది.

'ఆ చంటివాడు ఏమైపోతాడు? గుక్క తిప్పు కోగలడా? ఆకలితో చచ్చిపోతాడా? పుట్టగానే చచ్చిపోయేంత పాపం వాడేం చేశాడు? ఆ తల్లి ఏమయిపోతుంది? అంతమంది ఆ దృశ్యం చూస్తూ వున్నా ఎవరూ ఏం చేయరేం? తమను కానట్టు తప్పుకుపోతారేం?... కందిరీగల్లా రమణ బుర్రలో ఎన్నో ప్రశ్నలు! ఆలోచనలు!

"ఒరేయ్ రమణా! ఆలస్యం చేస్తే అవతల టికెట్లు అయిపోతాయి త్వరగా పదరా" అంటూ స్నేహితుడి చేయి పట్టి లాగాడు నవీన్.

రమణ తేరుకుని, ఏదో నిశ్చయానికి వచ్చిన వాడిలా ఏం జరుగుతోందో నవీన్ గ్రహించే లోపునే జేబులోంచి వంద రూపాయల నోటు తీసి ఆ స్త్రీ వొళ్లోకి విసిరాడు.

నోటు చూడగానే ఆమె కళ్ళల్లో వేయి దీపాల వెలుగు! జీవం లేని కన్నులు జ్యోతులు కాగా రమణ వంక చూసిందామె. ఆ చూపులో కృతజ్ఞతే కాదు, ఎన్నో భావాలు- భాష్యం చెప్పుకోగల శక్తే వుంటే! నోటు పట్టుకుని చేరువలోనున్న హోటల్ వైపు పరుగు తీసిందామె, పిల్లాడికి పాలు కొన డానికి కాబోలు!

నవీన్ నోట మాట రాలేదు. తృటికాలం కొయ్యబారిపోయాడు. తేరుకుని, "రమణా! ఏమిట్రా నువ్వు చేసింది?!" అన్నాడు తెల్లబోతూ.

రమణ జవాబివ్వలేదు. సజల నయనాలతో ఆమె వెళ్లిన వైపే చూస్తూ వుండిపోయాడు.

"మ్యాచ్ చూడాలని... టికెట్ కొనడానికి... డబ్బుల కోసం ఎంత అవస్థపడ్డావో, ఎన్ని దెబ్బలు తిన్నావో... మరచిపోయావట్రా? మీ అక్కయ్య ప్రేమతో ఇచ్చిన రిస్ట్ వాచ్ కూడా అమ్మేశావ్. ఇప్పుడు నువ్వేం చేశావో నీకేమైనా అర్థమవు తోందా?" స్నేహితుణ్ణి కుదుపుతూ మందలించ బోయాడు నవీన్.

"నవీన్! ఆ చంటాణ్ణి చూశావు కదురా? ఆకలితో చచ్చిపోతాడ్రా. నా మ్యాచ్ కంటే... ఆ పసికందు ప్రాణం ముఖ్యంరా. అందుకే... అందుకే..." ఎమోషన్‌తో రమణ గొంతు పెగల్లేదు. ఉబికి వస్తున్న కన్నీటిని చేతుల్తో తుడుచుకున్నాడు.

"మరి... క్రికెట్ మ్యాచో?" ఆశ్చర్యంతో అయోమయంగా గొణిగాడు నవీన్.

"పరవాలేదులేరా. స్టేడియం బయట సీసీ టీవీలు పెడతారట. ఆట వాటిలో చూడొచ్చులే. మన ఫేవరెట్ ప్లేయర్సంటావా? వాళ్లు బయట కొచ్చినప్పుడు చూద్దాం" అంటూన్న మిత్రుడి వంక కళ్ళప్పగించి నోరు తెరుచుకుని చూడడం తప్ప ఏమీ అనలేకపోయాడు నవీన్.

అదంతా నిశ్శబ్దంగా గమనిస్తున్న కర్మసాక్షి- 'లోకంలో మానవత్వం నశించిందని ఎవరన్నారు? అమానుషమనే చీకటిని మ్రింగిన ఆ చిరుదివ్వె భవితవ్యపు ఆశాజ్యోతి కాదా? ఆ చిన్నారి చర్య కొడిగడుతున్న మానవత్వానికి ఉత్తేజితం కాదా? సాటి వారికి వెలుగుబాట కాదా? ఇలాంటి బాలలే రేపటి సూర్యులై ఈ జగతిని వెలిగించరా? హ్యాట్సాఫ్ మై బాయ్!' అనుకున్నాడు సంతృప్తిగా. ■